
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 15 జూన్ 2023





చెత్త సేకరణ పనులు పర్యవేక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణకు ప్రజలంతా బాధ్యతగా సహకరించేలా చర్యలు తీసుకోవాలని, విధుల్లో చెత్త కనిపిస్తే శానిటేషన్ సెక్రటరీలను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ హెచ్చరించారు. బుధవారం ఆయన పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 50, 51, 52 డివిజన్లలోని రంగనాయకుల పేట, కపాడిపాలెం ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను పర్యవేక్షించారు. కపాడిపాలెం ప్రాంతం వీధుల్లోని లిఫ్ట్ పాయింట్ల వద్దనుంచి వాహనాల ద్వారా చెత్తను సేకరించడాన్ని గమనించిన కమిషనర్ శానిటేషన్ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కచ్చితంగా డోర్ టు డోర్ చెత్త సేకరణ మాత్రమే జరిగేలా పర్యవేక్షించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే షో కాజ్ నోటీసులు జారీ చేస్తామని శానిటేషన్ కార్యదర్శులను హెచ్చరించారు.నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, శానిటేషన్ సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ

నిర్ణీత గడువు లోపు లక్ష్యాలను సాధించాలి - వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని,నిర్ణీత గడువులోగా లక్ష్యాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని , ఈ నేపథ్యంలో మండల ,గ్రామ స్థాయి అధికారులు పథకాల అమలుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కలెక్టర్, ఎస్‌పితో తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి బుధ వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం.. జగనన్న సురక్ష, ఉపాధి హామీ పథకం, జగనన్న గృహ నిర్మాణ పథకం, వ్యవసాయం నీటి ప్రాజెక్టులు ,జగనన్న భూహక్కు భూ రక్ష పథకాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరి నారాయణన్ అధికారులతో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో నాణ్యత ఇంకా పెరగాలని ,ఒకవేళ పరిష్కారం కాని సమస్య అయితే అర్జీదారు సంతృప్తి చెందే విధంగా వివరించాలన్నారు. గ్రామాలలో ఉన్న సచివాలయాల లోనే సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈనెల 23 నుండి నెలరోజుల పాటు జగనన్న సురక్ష పథకం గ్రామ, వార్డు సచివాలయాలలో నిర్వహించాలని సీఎం ఆదేశించారని, ప్రతి మండలంలో మండల స్థాయి అధికారులతో రెండు టీములు ఏర్పాటు చేసుకొని ముందుగానే గ్రామస్తులకు తెలియజేసి ఆ రోజంతా గ్రామంలోనే ఉండి సమస్యలు పరిష్కరించడంతో పాటు వారికి కావలసిన సర్టిఫికెట్లు అక్కడే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి కేటాయించిన నిధులతో పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు.ఉపాధి హామీ పథకం కూలీలకు పనిచేసే ప్రాంతంలో త్రాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గృహాలు నిర్మించుకునే ఎస్ హెచ్ జి లకు బ్యాంకర్లతో మాట్లాడి రుణాలందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ బి కె ల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందే విధంగా చూడాలన్నారు. మొదటి దశ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 25 నాటికి ఒక్క రిజిస్ట్రేషన్ అయినా జరగాలని కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం నుంచి ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వర్ రెడ్డి , జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, ఏ ఎస్ పి. హిమవతి జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సిఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

రైతులకు ప్రతేడాది రూ.20 వేల కోట్లు..!

- 'కాకాణి' కోర్టు దొంగ
- రైతులతో లోకేష్ ముఖాముఖి
- భారీగా తరలొచ్చిన రైతులు
- సెల్ఫ్ ఫొటోల కోసం క్యూ



-నాయుడుపల్లిలో రైతులతో జరిగిన సమావేశంలో నారా లోకేష్, ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి/మర్రిపాడు

నారా లోకేష్ యువగళం పాదయాత్ర రెండో రోజు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో జరిగింది. నాయుడుపల్లిలో క్యాంప్‌లో రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ముఖాముఖి మాట్లాడారు. రమణయ్య అనే రైతు సోమశిల ముంపు బాధితులకు న్యాయం చేయలేదని, పరిహారం ఇవ్వడం లేదని, గ్రామాలు అభివృద్ధి చేయడం లేదని తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ హార్టికల్చర్‌కి ఎటువంటి ప్రోత్సాహం అందలేదని, టిడిపి హయాంలో ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చే వారని, మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని, . సూక్ష్మ పోషకాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫామ్ ఆయిల్ రైతులకు వైసిపి ప్రభుత్వం ఎటువంటి సాయం చేయడం లేదని, సబ్సిడీ వెయ్యడం లేదని తెలిపారు. పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పెట్టుబడి పెరుగుతుందని, మద్దతు ధర లేదన్నారు.జగన్ పాలనలో మిర్చి రైతులకి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతులు కల్తీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోతున్నారని, దిగుబడి తగ్గిపో తుందన్నారు. వరి రైతులను జగన్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బ తీసిందని, ధాన్యం కొనుగోలు చేయడం లేదని కొన్న ధాన్యానికి డబ్బులు వేయడం లేదన్నారు. వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ తొలి రోజే రైతులతో లోకేష్ సమావేశం కావడం మంచి పరిణామన్నారు. మర్రిపాడు మండలానికి సాగునీరు లేదని, . కేవలం వర్షాధారం పై రైతులు ఆధారపడ్డారన్నారు. సోమశిల హై లెవల్ కెనాల్ ప్రాజెక్టు పూర్తయితే తప్ప ఆత్మకూరు రైతుల సాగునీరు కష్టాలు తీరవన్నారు. ఫేస్ 1 పూర్తి చేయకుండా ప్రస్తుత ప్రభుత్వం ఫేస్ 2 పనులు మొదలు పెట్టి పార్టీ నాయకుడికి పనులు కట్టబెట్టారన్నారు. సోమశిల ఉత్తర కాలువను ఆధునీకరించాలని, ప్రస్తుత ప్రభుత్వం సోమశిల ఉత్తర, దక్షణ కాలువలను విధ్వంసం చేసి వదిలేశారన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లేక వలస వెళ్లి చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు, ఇతర పనులు చేసుకుంటున్నారన్నారు.



హాజరైన రైతులు

జగన్ రైతులు లేని రాజ్యం తెచ్చాడు -నారా లోకేష్

రైతు ఆత్మహత్యల్లో ఎపి దేశంలోనే నంబర్3 గా ఉందని నారా లోకేష్ విమర్శించారు. రైతులతో ముఖముఖి మాట్లాడారు. రైతుపై ఉన్న తలసరి అప్పులో ఎపిని నంబర్ 1 చేశాడన్నారు. టిడిపి హయాంలో ఒక్కో రైతు పై రూ.75 వేలు అప్పు ఉంటే ఇప్పుడు జగన్ పాలనలో ఒక్కో రైతుపై రూ.2.50 లక్షల అప్పు ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఆదుకోవడానికి ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే టిడిపి లక్ష్యమన్నారు. టిడిపి హయాంలో ఒకే సంతకంతో 50 వేల లోపు ఉన్న రుణాలు అన్ని మాఫీ చేస్తామని గుర్తు చేశారు. సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఆనం శుభకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు చేరువ : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని మెడికవర్ కేన్సర్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన బోన్ మ్యా రో ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ ను బుధవారం మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డితో కలసి ప్రారంభించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పేదలకు వైద్య సేవలు చేరువ చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్య శ్రీ సేవలను విస్తరించారన్నారు. మెడికవర్ కేన్సర్ హాస్పిటల్ వైద్య సేవలను విస్తరించడంలో భాగంగా బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ యూనిట్ ను ప్రారంభించి నూతన వైద్య సేవలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న ఈ వ్యాధికి అధునాతనమైన విధానంతో చికిత్స అందించాల్సిన అవసరం వుందని మంత్రి అన్నారు. లాభాపేక్ష కాకుండా ప్రజల కష్టనష్టాలు, మనోభావాలను గుర్తించి నిరుపేదలైన ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న సంకల్పంతో మెడికవర్ క్యాన్సర్ హాస్పిటల్ ఈ యూనిట్ ను ఏర్పాటుచేయడం అభినందనీ యమన్నారు. ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వైద్యానికి శ్రీకారం చుట్టడం అభినం దనీయమన్నారు. మెడికవర్ ఆసుపత్రి సిఇఒ డా. శ్రీలక్ష్మీ, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిజిహెచ్ అభివృద్ధి సొసైటీ కమిటీ కొ ఆర్డినేటర్ లక్ష్మి సునంద, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

డిసిపి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం డిప్యూటీ సిటీ ప్లానర్ గా పి.దేవికుమారి బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ వికాస్ మర్మత్ ను కార్యాలయంలో కలుసుకుని జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. అనంతరం కార్యాలయంలోని పురసేవా సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ పరిధిలోని అనధికార లే అవుట్లను క్రమ బద్ధీకరించేందుకు ప్రభుత్వ జీ.ఓ నెంబరు 14 మేరకు ఈనెల 30 వ తేదీన గడువు ముగుస్తుందంతో, క్రమబద్దీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం కూడా ఈనెల చివరికి ముగుస్తుందని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్లానింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు నిర్దేశించిన విధులను తప్పనిసరిగా పాటించాలని నూతన డి.సి.పి ఆదేశించారు.

వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు : స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్లో కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు డాక్టర్ పి.అనసూయ అధ్యక్షతలో గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బందికి క్షేత్ర స్థాయిలో మెరుగైన వ్యవసాయం పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్రం (డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి) డాక్టర్ శివనారాయణ పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ చిరు ధాన్యాలు సాగు సంవత్స రం 2023 కారణంగా చిరుధాన్యాలు వాటి సాగు, ఆవశ్యకత రాబోయే కాలంలో పంటలు ఎక్కువా వేసి ఆహారంలో ప్రధాన పంట గా ఉండాలన్నారు. రైతులకు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి రావాలని తదనుగుణంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ సి.మారుతి దేవి మాట్లాడుతూ పొలంబడి అవశ్యకత, గ్రామసభ, విత్తన రసాయనం వాడే మండలు ప్రభావం వలన కలిగే ప్రయోజనం గురించి వివరించారు. కెవికె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కంది, వరి, వేరుశనగ, కొర్ర పంటలలో వచ్చు కలుపు , తెగులు, పురుగులు విత్తన శుద్ధి గురించి వివరించారు.ఇఫ్కోకంపెనీ విఆర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ నానో టెక్నాలజీతో తయారు చేయబడిన నానో యూరియా, నానో డిఎపి రైతులకు అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయాధికారి మధురిమ. కందుకూరు, గుడ్లూరు, వివిపాలెం, ఉలవపాడు లింగసముద్రం వ్యవసాయ అధికారులు రాము, రవి కుమార్, హేమంత్, భారత్ కుమార్, తిరుమల జ్యోతి, అబ్రహం లింకన్ ఐదు మండలాల ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటాచలం : దశాబ్దాలుగా పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలను పరిష్క రించాల్సిన సమయం వచ్చిందని, అధికారులందరూ ఆ దిశగా బాధ్యతగా పనిచేయాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సా యంత్రం వెంకటాచలం ఎంపీడీవో కార్యాల యంలో సర్వేపల్లి నియోజకవర్గం సంబంధించి చుక్కల భూముల సమస్య నుంచి విముక్తి పొందిన రైతులకు ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. ఆర్డిఓ మలోల, ఎంపీపీ మందా కవిత, మండల వెంకట శేషయ్య ఉపయం పిపి కోదండరామిరెడ్డి ఉన్నారు.




వెంకటాచలంలో..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : పెండింగ్‌లో రెవిన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దష్టి సారిస్తున్నట్లు తహశీల్దార్ హమీద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నరుకూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్లను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆర్ఐ సునీల్ రెడ్డి, విఆర్ఓ వరిగొండ సురేంద్ర ఉన్నారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తి
ప్రాజెక్టు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కందుకూరు : విండ్-సోలార్ సమీకత విద్యుత్ సరఫరా స్థాపనకు అవసరమైన ప్రాథమిక సామగ్రిని దిగుమతి చేసుకున్న ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణ కార్యక్రమాలను బుధవారం ప్రారంభించింది. హైబ్రిడ్ ఉత్పత్తి సాధనకు అవసరమైన రీతిలో ఈ ప్రాజెక్టును తయారీదారులు రూపొందించారని కరస్పాం డెంట్ రామయ్య వివరించారు. దిగుమతి అయిన టర్బైన్ ను కంపెనీ దిశా నిర్దేశంతో ఈరోజు పునాదిలో పూజానంతరం కాంక్రీట్ చేయించినట్లు ప్రాజెక్ట్ ఇన్ ఛార్జి ఎస్ మీరావళి తెలిపారు. వినూత్న కార్యక్రమాల పట్ల కరస్పాండెంట్ కు ఉన్న ఆసక్తిలో భాగంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని టెక్నికల్ డైరెక్టరు డాక్టర్ కె.విజయ్ శ్రీనివాస్ వివరించారు. కోయం బత్తూరు నుండి వారం రోజుల్లో మిగిలిన మెటీరియల్ తీసుకొని సాంకేతిక సిబ్బంది వచ్చి ప్రాజెక్టును పూర్తి చేస్తారని విండ్ టర్బైన్ బాలాజీ సిస్టమ్స్ ఎం.డి కనకరాజు అభయమిచ్చారని రామయ్య తెలిపారు. రాయుడు ఎలక్ట్రికల్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కంచర్ల రామయ్య

ఎంఎల్ఎ 'మానుగుంట' చొరవతో
రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాళ్లపాడు గ్రామంలో జరిగి వివాహా కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రాజెక్టు రోడ్డుపైనా ఉన్న గుంతలను చూసి వెంటనే స్పందించారు .వివాహ కార్యక్రమంలో ఆయనతో పాటు పాల్గొన్న మండల వైసిపి నాయకుడికి ప్రాజెక్టు గుంతలను వెంటనే పూడిచ్చేలా చూడాలని చెప్పారు. అక్కడ నుంచే ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి పనులు త్వరగా జరిగేలా చూడాలని చెప్పా రు. వెంటనే పనులు మొదలుపెట్టి వారం రోజుల్లో గుంతలు పూడ్చి వేశారు. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.వర్షం ఎంఎల్ఎ స్పందించడంతో సమస్య పరిష్కారమైంది. ఎంఎల్ఎకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

రక్తదానం చేయడం అంటే ఓ మనిషికి ప్రాణదానం చేయడమేనని, రక్తం ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ఎంహరి నారాయణన్ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజల్వన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో రక్తదానం చేసిన దాతలకు, రక్తదానాన్ని ప్రోత్సహించిన వ్యక్తులకు, సంస్థల నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిటికల్ స్టేజిలో ఉన్న రోగులకు రక్తాన్ని దానం చేసి ప్రాణాలు కాపాడటంలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందననీయమన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర స్థాయి ఒక ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కేన్సర్ ఆసుపత్రి నిర్వహించడం అభినందనీ యమన్నారు. ప్రజల్లో వున్న అపోహలను తొలగించి రక్త దానం వలన కలుగు ఫలితాలను తెలియచేసి ఎక్కువ మంది ప్రజలు రక్తదానం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వివరించారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్, శాసన మండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అన్నీ దేశాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు జరుగుతున్నాయన్నారు. దేశంలో నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సంస్థల పరిధిలో ఎక్కువ సబ్ ప్రాజెక్ట్స్ నిర్వహిస్తున్న జిల్లా శాఖల్లో నెల్లూరు జిల్లా శాఖ ఒకటని పేర్కొన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా కోవిడ్ సమయంలో ప్లాస్మా ను డొనేట్ చేయడం ద్వారా ఎందరో ప్రాణాలను కాపాడుకోగలిగామన్నారు. రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, ట్రెజరర్ సురేష్ కుమార్ జైన్ , జిల్లా కమిటీ సభ్యులు రక్తదాతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

సియోల్ పర్యావరణ సదస్సులో 'విపిఆర్'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సియోల్‌లో జరుగుతున్న ఆసియా పసిఫిక్ పార్లమెంటేరియన్ల 20వ సాధారణ సమావేశంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 14,15వ తేదీన రిపబ్లిక్ ఆఫ్ కొరియాలో ని సియోల్‌లో "పర్యావరణం అభివృద్ధి" పై జరుగుతున్న ఆసియా పసిఫిక్ పార్లమెంటేరియన్ల 20వ సాధారణ సమావేశంలో పర్యావరణం అభివృద్ధిపై ఆసియా పసిఫిక్ పార్లమెంటేరియన్ల సమావేశం 1993లో రిపబ్లిక్ ఆఫ్ కొరియా జాతీయ అసెంబ్లీ ద్వారా పర్యావరణం ఫోరమ్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా 46 సభ్య దేశాలు, విధాన అభివృద్ధి పార్లమెంటరీ స్థాయిలో సహకారం ద్వారా ప్రభుత్వాల మధ్య పరస్పర ప్రయత్నాలకు మద్దతు ఇస్తుంది. పర్యావరణం అభివృద్ధి సమస్యలపై ప్రాంతీయ నాయకత్వం దానికి సంబంధించిన చర్చను ముందుకు తీసుకెళ్లడానికి, ప్రాంతీయ పరిష్కారాలను ప్రోత్సహించడానికి వేగవంతం చేయడానికి, ఈ కాన్ఫరెన్స్ ద్వారా ఆశించే ఫలితాలుగా తెలిపారు. సమావేశంలో పర్యావరణం అభివృద్ధికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలపై తన అభిప్రాయాన్ని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి మాట్లడుతూ, పర్యావరణం అభివృద్ధికి సంబంధించి భారతదేశం చొరవను ప్రస్తావించాల్సి వస్తే, భారతదేశంలో శ్రేయస్సు కోసం స్థిరమైన మార్గానికి కట్టుబడి ఉంటుంది. భూమిపై స్థిరమైన జీవితాన్ని నిర్ధారించడానికి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ ప్రయత్నాలకు సహకరించడానికి భారత ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు.



నీట్ ఫలితాల్లో
'విశ్వసాయి' విజయకేతనం

ప్రజాశక్తి-నెల్లూరు

నీట్ - 2023 ఫలితాల్లో విశ్వసాయి విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ తోపాటు అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారని కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. స్థానిక అన్నమయ్య సర్కిల్లోని విశ్వ సాయి కళాశాలలో 2023 విద్యా సంవత్సరానికి తమ కళాశాల నుంచి ఎంబిబిఎస్, బిడిఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు.కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల నుంచి 101 మందికి పైగా విద్యార్థులు చేరటానికి ఎంబిబిఎస్, బిడిఎస్ అర్హత సాధించగలిగారని తెలిపారు. తమ కళాశాల నుంచి కె జీవన్ రెడ్డి 613 మార్కులను సుహితక్ 598 నిధి 597 వంటి మంచి మార్కులు సాధించారన్నారు. ఒకే కళాశాల నుంచి 101 మంది పైగా విద్యా ర్థులు ఎంబిబిఎస్, బిడిఎస్‌లో చేరపోవడం తమకు సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు ఈ ఘన విజయాలను సాధించిన విద్యార్థులకు సాధిం పజేసిన అధ్యాపక, అధ్యాపకతర బందానికి అభినందనలు తెలిపారు. వైస్ చైర్మన్ కష్ణమోహన్ మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్య ఈ విజయానికి కారణమని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

'నారాయణ' విద్యార్థుల విజయకేతనం

నీట్-2023 ఫలితాల్లో నారాయణ మెడికల్ అకాడమి విద్యార్థినీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. 650పైగా ర్యాంకు వచ్చినవారు 7గురు, 600పైగా 24 మంది, 500పైగా 147 మంది విద్యార్థులు సాధించారనిఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతోపాటు డీన్లు, ఏజియమ్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఎపి ఎంసెట్ ఫలితాల్లో ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది సైతం నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఆధిక్యతను ప్రదర్శిం చారు. మెడికల్ , ఇంజనీరింగ్ విభాగాల్లో ర్యాంకులు సొంతం చేసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో జి.ప్రణీత్ సాయి 42వ ర్యాంకు, ఆర్ మేఘన 232 వ ర్యాంకు, పి.లోహిత్ ఆదిత్య 304వ ర్యాంకు సాధించారని తెలిపారు.

డాక్టర్ సింగయ్యకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసరు కనుమూరి సింగయ్య పి.హెచ్.డి సాధించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పిహెచ్‌డి సాధించడం ప్రకాశం లెక్చరర్ల సామర్థ్యానికి గీటురాయి నిలిచారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అభి వర్ణించారు. మైక్రో స్టక్చర్, మెగ్నీషి యం హైబ్రిడ్ మెటల్ మార్టిక్స్ మిశ్రమాల లోతుపాతులపై ఆయన పరిశోధన చేశారు. గుండె జబ్బులకు అమర్చే స్టంట్ సామర్థ్యాలపై రూపొందించిన థిసిస్ పై పిహెచ్‌డి ప్రదానం చేశారని డాక్టర్ కె.సింగయ్య వివరించారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.రవికుమార్, మెకానికల్ హెచ్ఒడి డాక్టర్ జి.వి.పున్నారావు, సివిల్ హెచ్ఒడి డాక్టర్ శర్మ,కాలేజీ అకడమిక్స్ ఇన్‌ఛార్జి ఎస్.ఎం.మీరావళి, ఎఒహరిబాబు ఇతర విభాగాల అధిపతులు ఎం.ఎం.రాయుడు, డాక్టర్ కె.సుబ్బారెడ్డి, డాక్టర్ సూరియా,ఎంబిఎ అధిపతులు డాక్టర్ దస్తగిరి, డాక్టర్ కే.లక్ష్మిపావని, జి.ప్రసాద్ లు ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన సింగయ్యను అభినందించారు.



ఇంటింటికి 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని పాలూరులోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఇంటింటికి ఇంటూరి కార్యక్రమం 4వ రోజు కొనసాగింది. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ప్రతి ఇంటికి వెళ్లి మినీ మేనిఫెస్టోను వివరిస్తూ, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. రెండు కాలనీల్లో డ్రెయినేజీ వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు నాగేశ్వరరావు దష్టికి తెచ్చారు. నాలుగేళ్లలో ఒక్కరికి కూడా పక్కా ఇల్లు మంజూరు చేయలేదన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఇంటూరి భరోసా ఇచాక్చరు. గ్రామ పార్టీ అధ్యక్షుడు సూరే వినోద్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయించి నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయ కులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, ఆళ్ల హరికష్ణ రెడ్డి, బుస్సారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వెంకారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దారుకుమల్లి రామకష్ణారెడ్డి, రామాల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



రక్తదానం మిన్న

ప్రజాశకిత -కందుకూరు : ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం అని సబ్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక పేర్కొన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా కందుకూరు పోస్ట్ ఆఫీస్ సెంటర్ దేవుడు అడుగుల వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కందుకూరు సబ్ బ్రాంచ్ ఏర్పాటుచేసిన ఉచిత రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. తొలుత సబ్ కలెక్టర్ తన రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్ష చేయిం చుకున్నారు. ఆమె మాట్లాడుతూ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అని అన్నారు. ఎవరి రక్తం గ్రూపు వారి తెలుసుకొని ఉండటం చాలా మంచిదన్నారు. కోటారెడ్డి మల్టీస్పెషల్టీ హాస్పిటల్, హరిణి హాస్పిటల్, విజయ హాస్పిటల్, ధన్యాసి శ్రీనివాస్ హాస్పిటల్ వారి సహకారంతో ఈ పరీక్షలను నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ చన్నా వెంకట రామాం జనేయులు, జాయింట్ సెక్రెటరీ గుర్రం అల్లూరయ్య, డాక్టర్ తన్నీరు మల్లికార్జున రావు, ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు చీదెండ్ల వేణుగోపాలరావు, ఆలిండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్, రెడ్ క్రాస్ సభ్యులు చక్కా వెంకట కేశవరావు, గుర్రం వెంకటేశ్వర్లు ఉన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 2016 మే నెల నుంచి ఇవ్వాల్సిన జనన ధ్రువీకరణ పత్రాలను బుధవారం ఎంపిడిఒ శేషబాబు, వైద్యాధికారి డాక్టర్ రమేష్ అందజేశారు. జనన ధ్రువీకరణ పత్రాలను ఇక నుంచి వెంటనే ఇవ్వాలని తెలిపారు. సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వైద్యులు పరిశీలించి తగిన సూచనలు చేశారు. సిహెచ్ఒ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్‌ఫలితాల్లో 'శ్రీ శ్రీనివాస' ప్రతిభ

ప్రజాశక్తి - కావలి

బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో కావలి "శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల" విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో వి.సమిత అనే విద్యార్థిని 470మార్కులకు గానూ 465 మార్కులు సాధించి పట్టణంలో మొదటిస్థానంలోనూ, రాష్ట్రంలో కెల్లా 2వ స్థానంలోనూ నిలిచిందని కళాశాల కరస్పాండెంట్ బట్టేపాటి అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వరుసగా తమ కళాశాల విద్యార్థులు పి.సౌమ్య464, ఎస్.కె.మల్లిక 463, ఏ.వి.రాకేష్463, కె.వైష్ణవి460 మార్కులు సాధించారని తెలిపారు. సి.ఇ.సి. విభాగంలో ఎం.అనూజ 500మార్కులకు గానూ 452 మార్కులు సాధించి పట్టణంలో మొదటిస్థానంలో నిలిచిందన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాలలో ఘనంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి : పట్టణంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ కిరణ్ వినతి పత్రం అందజేశారు. ముందుగా కమిషనర్ కిరణ్‌ను సుబ్బానాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కావలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీటి సమస్యపై కమిషనర్‌తో చర్చించారు. ముఖ్యంగా 35వ వార్డులోని మహిళలు తమకు నీటిసమస్య తీవ్రస్థాయిలో ఉందని వాపోయారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న కమిషనర్ త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి హామీనిచ్చారు. అనంతరం సుబ్బానాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ వారు ఏ టైంలో ఏయే వార్డులకు నీళ్ల వదులుతారో చెప్పాలని, రోజుకు ఎన్ని ట్యాంకర్లు పెట్టి నీళ్ల సరఫరా చేస్తున్నారో తెలపాలని, సమ్మర్ ట్యాంక్‌లో నీరు ఎంత నిల్వ ఉందో తెలిపాలని, ఎంత తెప్పించుకుంటున్నారో అని ఆరా తీశారు. కావలిలోని బోరు బావుల వాటర్ లెవెల్ పడిపోకుండా అనపగుంట, జొన్నాయిగుంట బొట్లగుంట, పాపిరెడ్డి చెరువులలో నీటి నిల్వలు ఉన్నాయా.. లేదా.. అంటూ ప్రశ్నించారు. త్వరలో ఈ సమస్యలకు పరిష్కారం చేయాలని, లేకుంటే టిడిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జన సందోహంతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, బొట్లగుంట శ్రీహరి నాయుడు, మొగిలి కల్లయ్య, ఏగూరి చంద్రశేఖర్, మంచాల ప్రసాద్, పోతుగంటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమక్షంలో కావలి పట్టణం పరిసర ప్రాంతమైన బుడం గుంట గిరిజన ప్రాంతంలో "బాల్య వివాహాల నిర్మూలన", "విద్య ప్రాముఖ్యత"పై, "మద్య పానం వల్ల కలిగే నష్టాలపై" టెలివిజన్ ద్వారా అవగాహన కార్యక్రమం చేపట్టారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర కావలి పట్టణం వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాషా, కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ చాకలికొండ.శారద, ఆర్.సి. ట్రస్ట్ ఫౌండర్, సి.ఎ.సి.ఎల్. జిల్లా కన్వీనర్ అబ్దుల్ అలీం, ఏపి స్టేట్ ఎంపిజె కార్యవర్గ సభ్యులు షేక్.రఫి మహమ్మద్, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు షేక్ ఖాదర్ బీ, మీకోసం మేము స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీప్‌కుమార్, విజయ్ భారత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై.కిరణ్‌కుమార్, జాగో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్.జమీర్, గుడ్‌హార్ట్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పి.సాయి, గుడ్‌మెన్స్ సేవాసంస్థ అధ్యక్షుడు సోమిశెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మైపాడు బీచ్‌లో ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని మైపాడు సముద్రతీరంలో ఇద్దరు గల్లంతైన ఘటన బుధవారం చేసుకుంది. హైదరాబాద్ వాసులు సన్నీ వారి కుటుంబ సభ్యులు సముద్ర స్నానం చేస్తుండగా, సన్నీ అనే చిన్నారి అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయాడు. అక్కడే సముద్ర స్నానం చేస్తున్న బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి అంబాపురానికి చెందిన చెంచయ్య (22), చిన్నారిని కాపాడబోయి మృతి చెందాడు. మృతుడు చిట్టమూరు మండలం అంకలిపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పుటాపుటిన చిన్నారి సన్నీని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

స్కూల్ టాపర్‌కు నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ ఫస్ట్ టాపర్లుగా వచ్చిన విద్యార్థులకు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా నగదు ప్రోత్సాహక బహుమతులను అందుకున్న వారిలో ఎఎస్‌పేటకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లాస్య శ్రీ రూ.5వేల నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్‌తో మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా సత్కరించబడిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ అమీద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని లాస్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో 15వ తేదీ గురువారం ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుని పదవ తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులను ఇంటర్మీడియట్ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ షేక్ నజీర్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఏ మేకపాటి విక్రమ్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు నియోజకవర్గంలోని పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు హాజరవుతారని సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్ వద్ద కావలి పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్స్, జెడ్‌పి హైస్కూల్స్, విశ్వోదయ బాలుర, బాలికల హైస్కూల్స్ (మొత్తం ఏడు హై స్కూల్స్) 2022-2023 బ్యాచ్‌లో పదవ తరగతి పరీక్షలలో ఆయా స్కూల్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు కావలి పట్టణ జెవివి ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పురస్కార అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ జీజావాద రవికుమార్, యోగా గురువు స్వస్తత, జెవివి అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, పి.జానకిరామ్, వేదిక ముఖ్య నాయకులు బహుమతులు అందజేశారు. పొట్టిశ్రీరాములు మున్సిపల్ హై స్కూల్ విద్యార్థిని పి.సుమాంజలి(580), 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్ ఓల్డ్ టౌన్ విద్యార్థిని షేక్.హీనా రుక్సార్ (580), 8వ వార్డు మున్సిపల్ హై స్కూల్ విద్యార్థి జోసెఫ్ డేవిడ్ ఇమ్మాన్యుయేల్ రావు (577), జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎం.గీతాంజలి (573), కె.ఎస్.ప్రశాంత్ కుమార్ రెడ్డి :541(జిల్లాపరిషత్ (బాయ్స్) హై స్కూల్ విద్యార్థి, విశ్వోదయ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని షేక్.మొబీనా (496), విశ్వోదయ బాయ్స్ హై స్కూల్ విద్యార్థి ఎస్.మహేష్ (437)లకు పురస్కారాలు, సర్టిఫికెట్స్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి నాయకులు గాదిరెడ్డి హరినాధ్, ఎస్.వెంకయ్య, టి.సుబ్బారావు శర్మ, షేక్ ఖాదర్ బాషా, కె.జాన్, జి. కళ్యాణ్, చాకలకొండ శారద, పెంచలయ్య, రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఆనం విమర్శలు తగవు


ప్రజాశక్తి-ఎఎస్‌పేట


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వెంకటగిరి ఎంఎల్ఏ ఆనం రామనారాయణరెడ్డికి లేదని ఎఎస్‌పేట మండల వైసిపి నేతలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఎఎస్‌పేటలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి టికెట్‌పై గెలిచిన ఆనం రాంనారాయణరెడ్డికి వైసిపి ప్రభుత్వాన్ని ప్రభుత్వ పథకాలను విమర్శించే అర్హత లేదని ఏ ప్రభుత్వంలో అయితే మంత్రి పదవి ఇవ్వలో ఆ ప్రభుత్వాన్ని విమర్శించే నైజం ఆనం రామనారాయణరెడ్డిది అని తెలిపారు. ముఖ్యంగా ఆత్మకూరు అభివృద్ధి ప్రదాతలైన మేకపాటి కుటుంబాన్ని మేకపాటి విక్రమ్ రెడ్డిని విమర్శించే అర్హత ఆయనకు లేదన్నారు. వైసిపి టికెట్‌పై గెలిచి నాలుగు సంవత్సరాలు వైసిపి ప్రభుత్వంతో ఉండి ప్రస్తుతం వైసిపి ప్రభుత్వాన్ని ప్రభుత్వ పథకాలను విమర్శించడం ఆయనకు సమంజసం కాదని వారు హితవు పలికారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో చెప్పిన మాట మేరకు ఇప్పటికే అన్ని హామీలను నెరవేర్చారని తండ్రికి తగ్గ తనయుడిగా జగన్మోహన్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మాజీ మేకపాటి గౌతంరెడ్డి ప్రస్తుత ఎంఎల్ఏ మేకపాటి విక్రమ్‌రెడ్డిలు ఉన్నత చదువులు చదువుకొని ఆత్మకూరు ప్రజల అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని అలాంటి వారిని విమర్శించేటప్పుడు ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఎవరి బలాలు ఏంటో రానున్న ఎన్నికల్లో ప్రజలే తేలుస్తారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బి.పద్మజారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ పి.రమేష్ రెడ్డి, ఎఎస్‌పేట గ్రామపంచాయతీ సమన్వయకర్త మైనారిటీ నాయకులు షేక్ జిలాని భాష, మండల వైసిపి నాయకులు అంబవరపు కోటిరెడ్డి, కాటూరి జనార్ధన్ రెడ్డి, ఐతా.వెంకటేశ్వర్లు, సూర శ్రీనివాసులు రెడ్డి, బొడా.భాస్కర్ రెడ్డి, కల్లూరు రవీంద్ర, వెంకటేశ్వర్లు, రమణయ్య, ప్రభాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పున:సమీక్ష చేస్తాం : నారా లోకేష్

ప్రజాశక్తి-ఉదయగిరి



జిల్లాల ఏర్పాటుపై పున:సమీక్ష చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకడిన ఉదయగిరి పరిసర మెట్ట ప్రాంతాలను కలిపి ఉదయగిరి జిల్లా చేయాలని జిల్లా పోరాట కమిటీ అధ్యక్షులు డాక్టర్ కె.వేణుగోపాల్ యువగళం పాదయాత్రలో భాగంగా మర్రిపాడు మండలం కదిరినాయుడు పల్లికు వచ్చిన సందర్భంగా మంగళవారం రాత్రి ఉద్యమ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటులో శాస్త్రీయత, సహేతుకత లేదని, రానున్న తమ ప్రభుత్వంలో జిల్లాల ఏర్పాటు ప్రక్రియను పున:సమీక్షిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో అన్యాయానికి గురైన ప్రాంతాలను గుర్తించి న్యాయం చేస్తామన్నారు. 2026లో లోక్‌సభ స్థానాలు పునర్విభజన కానున్నాయని ఆ మేరకు కొత్త జిల్లాలపై నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డిని, మాజీ ఎంఎల్ఏలు బొల్లినేని రామారావును, కంభం విజయరామిరెడ్డిని వారు కలిసి కొత్త జిల్లాల ఏర్పాటులో ఉదయగిరికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. కార్యక్రమంలో దుత్తలూరు మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు ఎస్.రవీంద్ర బాబు, జిల్లా పోరాట కమిటీ నాయకులు దస్తగిరి అహమ్మద్, ఖాదర్ బాషా, రామిరెడ్డి, ఖాజా, అలీజాన్, హమీద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండల పరిధిలోని తాళ్లూరు గ్రామ సచివాలయంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కనుక దుర్గ భవాని, ఎంపిడిఒ వెంకటసుబ్బారావుతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా కనకదుర్గ భవాని మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్‌తో పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు జారీ చేయడం గురించి సూచనలు సలహాలు తెలియజేశామని, 0-5 సంవత్సరాల వయసు ఉన్న ప్రతి ఒక్కరికీ పుట్టిన తేదీ జరగనున్న పత్రాలు అందజేయాలని ఎఎన్ఎంలను అంగన్‌వాడీ టీచర్స్‌ను ఆదేశాలు జారీ చేశామన్నారు. సచివాలయ సిబ్బంది హాజరును, బీమా ప్రయోజనాల గురించి వారికి వివరించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి-జలదంకి

భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలైనా రెవెన్యూ సదస్సు ద్వారా పరిష్కరిస్తామని తహశీల్దార్ సిహెచ్.పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం ఎంపిపి స్కూల్లో బుధవారం సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహశీల్దారు మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించి తగిన ఆధారాలతో అర్జీలు ఇస్తే వాటిని తప్పక పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అడంగల్ కరెక్షన్‌తో పాటు వన్ బి మార్పులు, చేర్పులు, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. అసైన్డ్, సిజెఎఫ్ఎస్ లబ్ధిదారులు మృతి చెంది ఉంటే వారి వారసులకు అందులో స్థానం కల్పిస్తామని తెలిపారు. పొలం కొనుగోలు చేసి ఉంటే వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందజేస్తే వారికి పాసుపుస్తకాలు ఇస్తామన్నారు. ఇంటికి సంబంధించిన ఇళ్ల స్థలాలు లేనివారికి నివేసిన స్థలాలు కేటాయిస్తామన్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం సచివాలయం కన్వీనర్లు దామెర్ల దేవదాసు, ఆలూరి లక్ష్మి నర్సారెడ్డి, వైసిపి నాయకులు గుమ్మిడి రమేష్, విఆర్ఒ కె శివకుమార్, విఆర్ఎలు వి.మోహన్ బాబు, సిహెచ్.మల్లికార్జున, అన్నవరం, దాసర అగ్రహారం, గడ్డవారిపాలెం అర్జీదారులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు పట్టణంలోని శ్రీనివాసా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో ఆత్మకూరు అపస్మా ఆత్మకూరు డివిజన్ ఆధ్వర్యంలో బస్సు డ్రైవర్‌లకు ట్రాఫిక్ వారోత్సవాల సందర్భంగా పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాములు పాల్గొని డ్రైవర్లకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ బస్సు ఎక్కేటప్పుడు తన బస్సు కండీషన్ సరిగా ఉందా.. లేదా.. చెక్ చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి మత్తు పానీయాలు సేవించి వాహనం నడపకూడదని, సరైన లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ అపస్మా పాఠశాలల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కావలి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

కావలి మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మునిసపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు కావలి మున్సిపల్ కమీషనర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్లె అంకయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ డైలీ వేజ్ కార్మికుల 2నెలల పెండింగ్ వేతనాలివ్వాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులు 2నెలల పెండింగ్ ఉన్న హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫారం అవుట్‌సోర్సింగ్, పర్మినెంట్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచాలన్నారు. ఇ.పి.ఎఫ్.లో రెండు యు.ఎఎస్ నెంబర్లున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్ ఇ.ఎస్.ఐ., ఇ.పి.ఎఫ్ నెంబర్లు ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులు మరణించిన ,వయోభారంతో రిటైర్డ్ అయిన వారి కుటుంబాలలోని వారసులకు ఆప్కాస్ ద్వారా ఉద్యోగాలివ్వాలని కోరారు. పారిశుధ్య పనికి సంబంధించిన పరికరాలు ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని అంకయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎండ్లూరి ఆదినారాయణ, కార్యదర్శి గుంజి కిషోర్, టి.వెంకటేష్, సిపిఐ కార్యదర్శి కొప్పర్తినాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

రక్తదాతలు మానవత్వానికి ప్రతిరూపాలు

ప్రజాశక్తి-కావలి


రక్తదానం చేస్తున్న దృశ్యం

సాటి వ్యక్తి ప్రాణాలను కాపాడడానికి తమ శరీరంలోని రక్తాన్ని దానమిచ్చేవారు మానవత్వానికి ప్రతిరూపాలని కావలి ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినం సందర్భంగా స్థానిక క్రిస్టియన్ పేటలోని లైఫ్ కేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కారల్ ల్యాండ్ స్టీనర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం రాష్ట్రస్థాయిలో వరుసగా 6సార్లు ప్రథమ స్థానంలో నిలవడంపై ఆదిలక్ష్మి హర్షం వ్యక్తం చేసారు. ఈ శిబిరంలో 58వ సారి రక్తదానం చేసిన దామిశెట్టి సుధీర్ నాయుడు, 28 వసారి రక్తదానం చేసిన ఆర్‌టిసి మెకానిక్ జె శ్రీనివాసులురెడ్డి, 15వ సారి రక్తదానం చేసిన డాకారపు పుష్యమిత్రలను ఆమె అభినందించారు. లైఫ్‌కేర్ హాస్పిటల్స్ నిర్వాహకులు, లింగ సముద్రం జెడ్‌పిటిసి డాక్టర్ నళినిపద్మ మాట్లాడుతూ రక్తంలో గ్రూపులను కనుగొన్న శాస్త్రవేత్త ల్యాండ్ స్టీనర్ జన్మదినాన్ని ప్రపంచ రక్తదాతల దినంగా పాటిస్తారన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కె.శివకుమార్ రెడ్డి, ఈతముక్కల చందు, కనమర్లపూడి వెంకట నారాయణ, జెనిగర్ల మహేంద్ర, పొనుగోటి అనురాధ, షమారహీం, కుందుర్తి సోదరులు, మండలి కృష్ణారావు, ఆత్మకూరు కలగయ్య, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి.రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, తదితరులున్నారు.

సంజీవని ఆరోగ్య రథానికి విశేష స్పందన

ప్రజాశక్తి-జలదంకి


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మండలంలోని బ్రాహ్మణక్రాకలో బుధవారం నిర్వహించిన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సంజీవని ఆరోగ్య రథానికి విశేష స్పందన లభించింది. స్థానిక లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ప్రజలు ఉదయం నుండి బారులుదీరారు. అక్కడ రోగులకు తాగునీరుతో పాటు మజ్జిగను కూడా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాటు చేశారు. మధుసూదన రెడ్డి స్థానిక ఆర్ఎంపి వైద్యులు ఎం.సాయికుమార్ పర్యవేక్షణలో సంజీవిని ఆరోగ్య రథం వైద్యులు రోగులకు ఉచితంగా సేవలు అందించారు. సుమారు 160 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అనంతరం వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే 121 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. గంటా అశోక్, కాసు చెంచునాయుడు, వేలమూరి ఉమామహేశ్వర రెడ్డి, పున్నం రోసిరెడ్డి, పరిమి శ్రీహరి నాయుడు, కడియాల వెంకటేశ్వర్లు, లింగంగుంట వెంకటేశ్వర్లు, కోనేటి మార్కండేయులు, మల్లీనేని కొండపనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మొదటి ప్రాధాన్యత యువతకే..

ప్రజాశక్తి-ఉదయగిరి

టిడిపి అధికారంలోకి రాగానే యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. బుధవారం మర్రిపాడు మండలం కదిరినాయుడు పల్లిలో యువగళం పాదయాత్ర సందర్భంగా పార్టీ యువ నాయకులు సయ్యద్ సంధాని మర్యాదపూర్వకంగా కలిసి వెనుకబడిన మెట్ట ప్రాంత నిరుద్యోగ యువతకు అండగా నిలవాలని కోరి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం రావడం ఖాయమని వైసిపి ప్రభుత్వంలో నిరుద్యోగ సమస్య మరింత ఎక్కువైందని టిడిపి ప్రభుత్వంలో యువతకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల కోసం యువత పార్టీ గెలుపునకు మరింత కృషి చేయాలని సూచించారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని తూర్పుచెన్నంపల్లి గ్రామంలో బుధవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఆదర్శ సేవాసంస్థ ఆధ్వర్యంలో దాతలు గడుపూటి కొండయ్య, మాజీ బిపిఎం గడుపూటి సౌభాగ్యమ్మ (మాజీ సర్పంచ్) నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్సులు, పరీక్ష ప్యాడ్లు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రమల ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఆదర్శ సేవాసంస్థ అధ్యక్షుడు బక్క అదెయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ర్యాలీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని మేదర వీధి ఎస్‌టి కాలనీలో జన భాగిరధి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిడి ఆదేశాలను సిడిపిఒ, ఎసిడిపిఒ, సూచనలతో సూపర్‌వైజర్ రత్నమ్మ సారాజ్యంలో జన భగిరధి ర్యాలీ అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ పిల్లల తల్లులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకట రమణమ్మ పాల్గొని మాట్లాడారు కార్యక్రమంలో పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పురిటి పిల్లల సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో అప్పుడే పుట్టిన పిల్లలను నాలుగు నెలల వయసులోపు పిల్లలకు సంక్రమించే అనేక వ్యాధులు నిర్ధారణ నివారణ మంచి చికిత్సల కోసం ఏర్పాటైన స్పెషలైజెడ్ న్యూ బార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సియు) సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రోషిణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం జిల్లా ఆస్పత్రిలో గతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కృషి మేరకు ఎస్ఎన్‌సియు ఏర్పాటు చేశారని తెలిపారు. పది పడకల ఉయ్యాలలో జాండిస్ ప్రత్యేక చికిత్స కోసం మరో ఐదు పడకలు ఈ కేంద్రంలో ఏర్పాటయ్యాయన్నారు. ఆసుపత్రిలో డెలివరీ అయ్యే చిన్నారులకు సమస్యలు ఏర్పడితే ఈ కేంద్రంలో విరుదైన చికిత్స అందుతుందని అదే క్రమంలో ఇతర ప్రాంతాలలోని ఆసుపత్రుల్లో అప్పుడే పుట్టిన చిన్నారులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఏర్పడిన ఈ కేంద్రంలో ఉచితంగా వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ విషయాన్ని డాక్టర్లు తల్లిదండ్రులు గమనించాలన్నారు. వైద్యానికి ఆ చిన్నారులకు సంక్రమించిన వ్యాధి తీవ్రతను బట్టి రోజుకు రూ.3500 నుంచి రూ.8000 వరకు ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వసూలు చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం ఉచితంగా అందుబాటులోకి తెచ్చిందన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా వివిధ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శ్వాస సమస్యలు కామెర్లు మూర్ఛా పాలు తాగకపోవడం వాంతులు విరోచనాలు షుగర్ పరిమాణాలు తగ్గిపోవడం బరువు తక్కువగా ఉండటం లాంటి వాటిని ఉచిత చికిత్స అందుబాటులో ఉంటుందని డాక్టర్ రోహిణి తెలిపారు.

నేడు బ్రాహ్మణక్రాకలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని బ్రాహ్మణక్రాక లైబ్రరీ అగ్రహారంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దారు భరత్ ప్రకటనలో తెలిపారు. ప్రధాన గ్రామంలోని బ్రాహ్మణక్రాక లైబ్రరీ వద్ద ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామసభ జరుగుతుందన్నారు. అలాగే ఎంపియుపి స్కూల్ బ్రాహ్మణక్రాక అగ్రహారంలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రెవెన్యూ సదస్సు గురించి టామ్ టామ్ చాటింపులు వేయించినట్లు తెలిపారు. భూములకు సంబంధించి సమస్యలు ఉన్నవారు అర్జీలు అందజేయాలన్నారు.

విద్యాకానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-సంగం


సంగంలో...

స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో హెడ్ మాస్టర్ బుజ్జయ్య జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్‌పిటిసి రావుల లక్ష్మీ, వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎంఇఒ జానకీరామ్ పాల్గొని విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేశారు. అనంతరం పాఠశాలలోనే నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కాలేజీని ప్రారంభించి విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రయివేట్ పాఠశాలలతో ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు రాణిస్తున్నాయని తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు జగనన్న విద్యా కానుక సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఎంఇఒ జయంత్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులందరికీ ఉచితంగా పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్సులు, బెల్టు, యూనిఫారం దుస్తులను బోగోలు సర్పంచ్ పి.అనిత, జెడ్‌పిటిసి కీర్తన, మండల అధ్యక్షురాలు సుజాత అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలను రూపురేఖలను మార్చారని, కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. బోగోలు మండలంలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పాత బిట్రగుంట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు సాధించారని, తల్లిదండ్రులు వారిపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్య కమిటీ చైర్మన్ సంధ్యా కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు రాధయ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-మర్రిపాడు



స్థానిక గ్రంథాలయంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు బుధవారంతో ముగిశాయని గ్రంథాలయాధికారి నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సమయంలో విద్యార్థులు వేసవి తాపానికి ఆరుబయటకు తిరిగకుండా వారిలో ఉన్న సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం వేసవి శిక్షణా తరగతులు నిర్వహించిందన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలలో పాల్గొన్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, సర్పంచ్ ఎస్‌కె బీబీజాన్, చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కావలి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బుధవారం నుండి చేస్తున్న "వారాహి యాత్ర" విజయవంతం కావాలని జనసేన నాయకులు మద్దూరు పాడు ఆంజనేయ దేవస్థానం వద్ద పూజలు చేసి, 101 టెంకాయలు కొట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పట్టణ జనసేన అధ్యక్షులు పొబ్బ సాయివిఠల్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ చేస్తున్న "వారాహియాత్ర" విజయవంతం కావాలని అన్నదానం చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతూ, ప్రజలకు భరోసా కల్పించేందుకు జనసేన ఈ యాత్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ చేస్తున్న దోపిడీపై, దౌర్జన్యాలపై జనసేన అలుపెరుగని పోరాటం చేస్తుందని అందుకు ఈ య వాత్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో సమ్మను వెంకట సుబ్బయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జి.రవి, మన్ననేపల్లి రిషి, గడే నాగార్జున, ఆలా శ్రీనాథ్, బెల్లంకొండ మస్తాన్, తోట చరణ్, తిరుమలశెట్టి సుధీర్, గుడిపల్లి వెంకయ్య, గడే భవాని, గడే మహేంద్ర, అజయ్, మనోహర్, తేజ, మనోజ్, షాహిద్, తదితరులున్నారు.

ప్రజా సంక్షేమమే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్ర ప్రజలందరూ పార్టీలకతీతంగా జగన్మోహన్ రెడ్డి ఆశీర్వదిస్తున్నారని ఎంఎల్ఏ నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని గడప గడప కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైసిపి స్థాపించినప్పటి నుంచి ఒంటరిగా పోరాటం చేసి రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి రాబోతున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సింగల్ గానే వస్తాడు, చంద్రబాబు ఓపక్క పవన్ కళ్యాణ్‌తో స్నేహం చేస్తూ బిజెపితో పొత్తు పెట్టుకోవాలని రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.మొట్టమొదటి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రితో జగన్మోహన్ రెడ్డి అభినందిస్తుంటే రాష్ట్రంలో ఉన్నటువంటి ఆర్థిక పరిస్థితులు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయడం వాళ్ళ దగ్గర నుంచి రాబట్టాల్సినటువంటి నిధులు మన రాష్ట్రానికి తెచ్చుకోవడం ఇప్పటిదాకా జరిగిందని తెలిపారు. బిజెపి నాయకులు జగన్మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.చంద్రబాబు బందం ఏమి తిట్టమంటే అది తిడుతున్నారు. జగన్మోహన్ రెడ్డిని తిట్టడం మా ప్రభుత్వాన్ని విమర్శలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో డిఏఏబి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబు రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకష్ణారెడ్డి, జెడ్‌పిటిసి కవరగిరి శ్రీలత, ఎంపీపీ పార్వతి, వైస్ ఎంపీపీ శివుని నరసింహారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, సర్పంచ్ యాకసిరి విజయ లక్ష్మి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.